సాక్షి ప్రకాశం

మంగళవారం । 20 । మే । 2025



వైభవంగా మహా కుంభాభిషేకం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. వేలాది మంది మహిళలు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. - 8లో..



వైస్ పీఠాలు వైఎస్సార్ సీపీకే..

మార్కాపురం, త్రిపురాంతకం మండలాల వైస్ ఎంపీపీల ఎన్నిక సోమవారం జరిగింది. వైఎస్సార్ సీపీకి చెందిన వారే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పలు కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా మహిళా ప్రాంగణంలో త్వరలో బ్యూటీషియన్, మగ్గం వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడర్, ఫ్యాబ్రిక్ కట్టర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్ వై.అంజమ్మ తెలిపారు. ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మహిళా ప్రాంగణ కార్యాలయానికి వచ్చి 18 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 83339 21346 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రతి అర్జీపై శ్రద్ధ పెట్టాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు బదిలీ చేస్తూ సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వాటికి అర్థవంతమైన సమాధానమిస్తూ పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ బి.చినఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, శ్రీధర్, వరకుమార్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులకు పదవులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన నాయకులను వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. దివ్యాంగుల విభాగం రాష్ట్ర సెక్రటరీగా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా దర్శి నియోజకవర్గానికి చెందిన దగ్గుల బ్రహ్మానందరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

జోరువానలోనూ సీహెచ్‌ఓల పోరు

ఒంగోలు టౌన్: పదోన్నతులు, క్రమబద్ధీకరణ, పీఎఫ్ పునరుద్ధరణ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరింది. సోమవారం భారీ వర్షంలోనూ సీహెచ్‌ఓలు దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించడం వల్ల ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థిక భారం పడదని చెప్పారు. తామేమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, పెరిగిన నిత్యావసరాల వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని వేతనం పెంచాలని కోరారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌ఓల్లో 85 శాతం మహిళలు ఉన్నారని, ఆడబిడ్డల మొహం చూసైనా న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీకాంత్, శైలజ, కామేష్, ఖాదర్ వలి, బాబురావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న సీహెచ్‌ఓలు

ప్రతిష్టాత్మక ద్రోహం!

ఒంగోలులోని ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసిందా..? అంటే, పరిశీలకులు అవుననే అంటున్నారు. అద్దె చెల్లించడం భారమవుతుందన్న సాకులు చెప్పి జిల్లా కేంద్రమైన ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఇడుపులపాయ, నూజివీడు సెంటర్లకు తరలిస్తూ గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అదే కారణంతో ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కూడా ఎత్తేసేందుకు తెరవెనుక యత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రెండు క్యాంపస్‌లకు సంబంధించి రూ.3 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఒంగోలులో ట్రిపుల్ ఐటీ కాలేజీని పూర్తిగా ఎత్తేయాలన్న కుట్రతోనే అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించడం లేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

- ఒంగోలు ట్రిపుల్ ఐటీకి కష్టాలు
- విద్యుత్ బిల్లు, అద్దెలు చెల్లించకుండా కుట్రలు
- ఇప్పటికే రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు మంగళం
- ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌పై కూడా కన్ను
- 2027 జనవరితో ముగియనున్న ఎస్ఎస్ఎన్ క్యాంపస్ లీజు అగ్రిమెంట్
- రూ.3 కోట్ల విద్యుత్ బకాయిలు
- స్పందించని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు



ట్రిపుల్ ఐటీ ఎస్ఎస్ఎన్ క్యాంపస్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలు లేకపోవడంతో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం ఐదు బ్రాంచీలతో, రెండో సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులతో నగరంలోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో కొనసాగుతోంది. చీమకుర్తి రోడ్డులోని ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో 2, 3, 4 సంవత్సరాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల నుంచి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు అద్దె చెల్లించడం నిలిపివేసింది. దాంతో అద్దె బకాయిలు భారీగా పేరుకుపోయాయి. అయినా క్యాంపస్ యజమాని మాలకొండయ్య నాయుడు కాలేజీపై ఎలాంటి ఒత్తిడి చేయలేదని సమాచారం. ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదని విశ్వసనీయ సమాచారం. అయినప్పటికీ ప్రభుత్వం ఒంగోలు క్యాంపస్‌ను తరలించేందుకు ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. దీని కోసం వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఒంగోలు క్యాంపస్‌ను తరలించేందుకుగానూ కమిటీ వేసినట్లు చెబుతున్నారు. అయితే, ఆ కమిటీ ఒంగోలు క్యాంపస్‌లో పని చేస్తున్న ఉద్యోగులతోగానీ, విద్యార్థులతోగానీ మాట్లాడలేదు. పోనీ, ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీలోని అధికారులతో కూడా మాట్లాడిన దాఖలాలు లేవు. ఎవరితోనూ మాట్లాడకుండానే క్యాంపస్ తరలింపునకు అనుకూలంగా ఏప్రిల్ 28వ తేదీ వైస్ చాన్సిలర్‌కు నివేదిక ఇచ్చింది. దీనిపై ఈ నెల 6వ తేదీ ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో డైరెక్టర్, ఏఓ, అకడమిక్ డీన్లు క్యాంపస్ తరలించనున్నట్లు ప్రకటించారు. దీంతో విస్తుపోయిన రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఉద్యోగులు ఆర్జీయూకేటీలో పనిచేస్తున్న మొత్తం సిబ్బందికి ఈ విషయం తెలియజేయాలని కోరారు. దీంతో 7వ తేదీ ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో కూడా సమావేశం పెట్టి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను తరలిస్తున్నట్లు వెల్లడించారు. క్యాంపస్‌ను తరలించవద్దంటూ 80 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది 12వ తేదీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ బిల్లులు ఎందుకు చెల్లించలేదు..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రావ్ అండ్ నాయుడు క్యాంపస్ కరెంటు బిల్లు రూ.90,96,753, ఎస్ఎస్ఎన్ క్యాంపస్ విద్యుత్ బిల్లు రూ.1,82,00,262 చెల్లించాల్సి ఉంది. ఈ వారంలో రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌కు విద్యుత్ సరఫరా కట్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన క్యాంపస్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఈ విషయం బయటకు తెలియకుండా విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఇలా తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యార్థులు విమర్శిస్తున్నారు.

ముగుస్తున్న ఎస్ఎస్ఎన్ క్యాంపస్ లీజు...

చీమకుర్తి రోడ్డులోని ఎస్ఎస్ఎన్ క్యాంపస్ లీజు 2027 జనవరిలో ముగియనుంది. దీనికి నెలకు రూ.40 లక్షల అద్దె చెల్లించేలా అగ్రిమెంటు ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి వరకు అక్కడ క్యాంపస్ కొనసాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని చెబుతున్న అధికారులు.. ఆ తర్వాత మాత్రం ఏం జరుగుతుందో చెప్పలేమంటున్నారు. విద్యుత్ బిల్లులనే చెల్లించని ప్రభుత్వం, రూ.40 లక్షల అద్దె మాత్రం ఎందుకు చెల్లిస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. లీజు ముగిసిన తర్వాత ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కూడా తరలించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్పందించని టీడీపీ ఎమ్మెల్యేలు...

ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీని ఇడుపులపాయకు తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునే విషయంలో జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులలో స్పందన కానరావడం లేదు. ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ కాలేజీని తరలిస్తూ వైస్ చాన్సిలర్ ఉత్తర్వులు జారీ చేసినా, ఆ విషయాన్ని అధికారులు, ఉద్యోగుల దృష్టికి తీసుకొచ్చినా టీడీపీ ఎమ్మెల్యేలు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు నటిస్తున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఉన్న ట్రిపుల్ ఐటీని ఒంగోలు నుంచి తరలించడంపై జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్లయినా లేదని పలువురు మండిపడుతున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ దామోదర్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్ : ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాలపరిమితి లోగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 70 ఫిర్యాదులు రాగా, ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ దామోదర్, పోలీస్ అధికారులు.. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకునే చర్యలపై నివేదిక కూడా ఇవ్వాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్లు/కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదు దారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ సురేష్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- పొదిలి పొగాకు వేలం కేంద్రం సందర్శన



పొదిలి పొగాకు వేలం కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

పొదిలి రూరల్: పొగాకు రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శించారు. సోమవారం పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని వారు సందర్శించారు. వారికి పూలమాలలతో రైతులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేలం బిడ్డింగ్‌లో పొగాకు కొనుగోళ్ల తీరును పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలై తీవ్ర మనోవేదనతో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అప్పుల బాధలు తట్టుకోలేక ఇటీవల పర్చూరు నియోజకవర్గంలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు కంపెనీల ప్రతినిధులు రైతులను ప్రోత్సహించి పంట సాగు చేయించారని, తీరా కొనుగోళ్ల సమయంలో వారు కనిపించకపోవడం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అప్‌గ్రేడ్ ఉన్న ఎస్-2, ఎఫ్-1 రూ.240 నుంచి రూ.250కి కూడా అమ్ముడుపోయే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అమరావతి నిర్మాణానికి వేల కోట్లు ఖర్చు చేస్తామంటున్నారని, కానీ, పంటలు పండించే రైతులకు కనీసం గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్నారా అని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు...

సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినప్పటికీ రైతుల గురించి పట్టించుకోకపోవడంతో మిర్చి, పొగాకు, ధాన్యం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు రూ.100 కోట్లు వెచ్చించి పొగాకు కొనుగోళ్లు చేయించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుతం లో గ్రేడ్ అని చెప్పి నో బిడ్ కింద వెనక్కి పంపిస్తున్నారని, పొగాకు ధరలు దారుణంగా పడిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది పెట్టుబడి ఎక్కువై పంట దిగుబడి కూడా తగ్గిందన్నారు. దీనికితోడు పొగాకు బోర్డు కొనుగోలు చేసే రేట్లు కూడా తగ్గడం వలన రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుకు అన్నిరకాలుగా అండగా నిలబడిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుతం దుర్మార్గంగా ప్రైవేటు వ్యాపారులు వారికిష్టమైన రేట్లు ఇవ్వడం వలన రైతాంగం పూర్తిగా నష్టపోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునఃపరిశీలన చేసి గత ప్రభుత్వ విధానాలు అవలంబించి రైతులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్, అధికారులు, పొదిలి, కొనకనమిట్ల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జి.శ్రీనివాసులు, గొలమారి చెన్నారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, ఎం.మురళి, గుజ్జుల సంజీవరెడ్డి, ఫిరోజ్, రైతులు పాల్గొన్నారు.



ఒంగోలు జీజీహెచ్ వద్ద నిలిచిన వర్షం నీరు

మండు వేసవిలో చల్లని వాన..!

ఒంగోలు నగరంలో కుంభవృష్టి కురిసింది. సోమవారం తెల్లవారుజామున 4 నుంచి 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ఒంగోలు నగరం తడిసిముద్దయింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విడతల వారీగా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. 40 డిగ్రీల ఎండ వేడితో ఉక్కిరిబిక్కిరి అయిన నగరవాసులు ఒక్కసారిగా వాతావరణం మారడంతో చల్లబడ్డారు.

– సాక్షి, ఒంగోలు



రోడ్డుపై భారీగా నిలిచిన వర్షం నీటిలో ఆటో..



ఒంగోలు శివాలయం వీధిలో కురుస్తున్న వర్షం

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
- ప్రకాశం భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- టోల్ ఫ్రీ నంబర్ 1077

ఒంగోలు సబర్బన్: జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయిలో ఒంగోలులోని ప్రకాశం భవనంలో 1077 టోల్ ఫ్రీ నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు కంట్రోల్ రూం నిరంతరాయంగా పనిచేస్తుందన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, వైద్య సిబ్బందిని కలెక్టర్ కేటాయించారు. ప్రతి 12 గంటలకు ఒక టీం పని చేసేలా రెండు బృందాలను ఆయా శాఖల సిబ్బందితో ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, భారత వాతావరణ శాఖలు చేసిన ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించేందుకు ఈ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫోన్ కాల్స్‌ను రిసీవ్ చేసుకుని ఆ వివరాలను సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమన్వయంతో తక్షణమే స్పందించేలా ఇందులోని సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా మండల, డివిజన్ స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పలు ప్రాంతాల్లో వర్షాలు...

మండుటెండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తరుణంలో వాతావరణంలో వచ్చిన మార్పులతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తూ జిల్లాలో వాతావరణం చల్లబడింది. సోమవారం పగలంతా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కొత్తపట్నం మండలంలో అత్యధికంగా 56.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా ఒంగోలు 42.6 మిల్లీమీటర్లు, పొదిలి 36.2, కొండపి 34.4, జరుగుమల్లి 32.8, టంగుటూరు 24.8, తాళ్లూరు 20.8, నాగులుప్పలపాడు 19.8, సింగరాయకొండ 16.6, వెలిగండ్ల 15, మద్దిపూడి 14.6 మిల్లీమీటర్లతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా ఒక మోస్తరు వర్షం నుంచి చిరుజల్లులు కురిశాయి.

వైఎస్సార్ సీపీపై అభిమానం అభినందనీయం

- పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



ఒంగోలు సిటీ: మార్కాపురం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షునిగా కుందురు మల్లారెడ్డి, త్రిపురాంతకం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షునిగా పాటిబండ్ల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికవడం, వైఎస్సార్ సీపీ పట్ల వారు చూపిన అంకితభావం ఎంతో అభినందనీయమని పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం అవుతుందనడానికి ఇదొక ఉదాహరణ అని అన్నారు. జిల్లాలో పార్టీ ప్రతిష్ట పెంచుతూ నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ ముందుండి నడిపిస్తున్న జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఐదు గ్రానైట్ టిప్పర్ల సీజ్

చీమకుర్తి:

ఓవర్ లోడుతో వెళ్తున్న ఐదు గ్రానైట్ టిప్పర్లను చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు సోమవారం సీజ్ చేశారు. రామతీర్థం డంపింగ్‌ల నుంచి రామాయపట్నం పోర్టు నిర్మాణానికి గ్రానైట్ వేస్ట్ రాళ్లతో వెళ్తున్న టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఓవర్ లోడు కారణంగా తరచూ ట్రాఫిక్ అంతరాయం, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్టీఓ డిపార్టుమెంట్ అధికారులతో పాటు విజిలెన్స్ డిపార్టుమెంట్ వారు దృష్టి పెట్టి ఓవర్‌లోడుతో వెళ్లే వాహనాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.



పోలీసులు సీజ్ చేసిన గ్రానైట్ టిప్పర్లు

క్లుప్తంగా

కోర్టు కానిస్టేబుల్ పాత్ర చాలా కీలకం

● ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: నేరస్తులకు శిక్ష విధించి, బాధితులకు న్యాయం చేయడంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర చాలా కీలకమని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం కోర్టు మానిటరింగ్ సిబ్బందితో ఎస్పీ సమావేశమయ్యారు. కోర్టు ట్రయల్ దశలో ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. సాక్షులు కోర్టులో సాక్ష్యం చెప్పేలా తర్ఫీదు ఇవ్వాలని, సేకరించిన సాక్ష్యాలను సరైన పద్ధతిలో కోర్టులో ప్రవేశపెట్టాలని చెప్పారు. పోలీసు స్టేషన్లో నమోదయ్యే కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు. లోక్ అదాలత్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొమరోలు: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాలు.. కొమరోలు మండలంలోని క్రిష్ణంపల్లె గ్రామానికి చెందిన కె.మహేష్ ఈ నెల 16వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్యం విషమించడంతో వైద్యులు ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మహేష్ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

బ్యాంకులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

పెద్దదోర్నాల: మండల కేంద్రమైన పెద్దదోర్నాలలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఖాతాదారులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ తీగలు కాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బ్యాంకు సిబ్బంది వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తేవడంతో ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



బైక్‌పై టార్పాలిన్ పట్ట తీసుకెళ్తూ..

ఉప్పు రాశిని సిద్ధం చేస్తూ..



కష్టాలవణం

వాతావరణంలో మార్పులతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఉప్పు రైతులను ఇబ్బందులపాలు చేశాయి. కొత్తపట్నం సమీపంలో.. కయ్యల్లో ఉప్పు వర్షానికి కరిగిపోకుండా రాశులు పోసి జాగ్రత్త చేసుకునే క్రమంలో రైతులు హైరానాపడ్డారు. - సాక్షి, ఒంగోలు



వర్షం నీరు నిలవకుండా ఉప్పు రాశి చుట్టూ గాడి తీస్తున్న రైతు



కయ్యల్లో నుంచి ఉప్పు తెచ్చి రాశిగా పోస్తున్న కూలీలు



వర్షానికి ఉప్పు తడవకుండా టార్పాలిన్ పట్ట కప్పుతున్న కూలీలు

వైభవంగా మహా కుంభాభిషేకం

- ● జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన శింగరకొండ క్షేత్రం
- ● గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు 3 వేల మంది మహిళలతో శోభాయాత్ర
- ● యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మేనక(ఏనుగు)
- ● ప్రత్యేక అతిథిగా హాజరైన శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి



మూడు వేల మంది మహిళలతో సాగిన శోభాయాత్ర



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి/అద్దంకి రూరల్: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ప్రాంగణం 'జై శ్రీరామ్.. జై ఆంజనేయం, ప్రసన్నాంజనేయం' నామస్మరణతో మార్మోగిపోయింది. సోమవారం మహా కుంభాభిషేక నూతన ఆలయ ప్రారంభం, విమాన శిఖర కలశ ప్రతిష్ట, జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ నెల 14న ప్రారంభమైన కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. కుంభాభిషేకంలో భాగంగా విమాన శిఖర కలశ ప్రతిష్ట, నూతన ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 3 వేల మంది మహిళా భక్తులతో ఉదయాన్నే అద్దంకి పట్టణానికి సమీపంలో ఉన్న గుండ్లకమ్మ నది నుంచి మూడు వేల కళశాలతో జలాన్ని తీసుకుని 'జై శ్రీరామ్.. జై శ్రీరామ్' నామస్మరణ చేసుకుంటూ శింగరకొండ వరకు శోభాయాత్ర నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, ప్రత్యేక నృత్యాలతో, దేవతా వేషధారుల విన్యాసాలతో కన్నుల పండువగా సాగింది.

కిక్కిరిసిన క్యూలైన్లు..

కుంభాభిషేక కార్యక్రమాన్ని శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి నిర్వహించారు. కుంభాభిషేకానికి హాజరైన భక్తులతో క్షేత్రంలోని ప్రత్యేక క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సామాజిక వర్గాల్లోని సత్రాల్లో అన్నదానంతోపాటు, దేవాలయ అధికారుల ఆధ్వర్యంలో 30 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. అద్దంకి బస్టాండ్ నుంచి భవిష్య పాఠశాలకు చెందిన రెండు బస్సులు భక్తులను ఉచితంగా చేరవేశాయి. కోటా శ్రీనివాసకుమార్ భక్తులకు తాగునీరు సరఫరా చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి

ప్రసన్నాంజనేయ స్వామికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎం తిమ్మనాయుడు, సిబ్బంది పర్యవేక్షించారు. 700 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

మహిమాన్వితుడు అంజన సుతుడు

● విధుశేఖర భారతిస్వామి



అనుగ్రహ భాషణం చేస్తున్న విధుశేఖర భారతి

లక్షల డబ్బు ఖర్చు పెట్టే పని లేకుండా 108 సార్లు రామ నామ జపం చేస్తే చాలా ఎక్కువ ఫలితం పొందవచ్చని శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి అన్నారు. మహా కుంభాభిషేకం అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. రామాయణంలోని సుందర కాండలో, కిష్కింధకాండలో ఆంజనేయస్వామి దివ్యమైన చరిత్ర మనకు తెలుస్తుందని చెప్పారు. అనాది కాలం నుంచి ఆంజనేయస్వామి ఆరాధనను చేయడం సంప్రదాయంగా వస్తుందని, ఆయన మహిమ అపారమైనదన్నారు. శింగరకొండలో ఒకే దేవతను రెండు రూపాల్లో కొండపైన లక్ష్మీ నరసింహస్వామి గానూ, కొండ కింద ఆంజనేయస్వామిగానూ మనకు దర్శనం ఇస్తున్నారన్నారు. శింగరకొండ దివ్య క్షేత్రమని చెప్పారు. అటువంటి క్షేత్రంలో ఆ స్వామికి నూతనాలయం, నూతన విమాన గోపుర, కలశ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న వారంతా భగవత్ అనుగ్రహానికి పాత్రులు అయ్యారన్నారు. ఏదో పూర్వజన్మ పుణ్యం ఉంటేనే ఇటువంటి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారని చెప్పారు.



త్రిపురాంతకం వైస్ ఎంపీపీగా కృష్ణ ఎన్నికైన అనంతరం ఎంపీటీసీ సభ్యులతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

వైస్ ఎంపీపీల ఎన్నిక ఏకగ్రీవం

- ● మార్కాపురం, త్రిపురాంతకంలో మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికలు
- ● రెండు మండలాల్లోనూ సత్తా చాటిన వైఎస్సార్ సీపీ
- ● వైస్ ఎంపీపీలుగా ఎన్నికైన కుందురు మల్లారెడ్డి, పాటిబండ్ల కృష్ణ



డీఎల్‌పీఓ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వైస్ ఎంపీపీ మల్లారెడ్డి

మార్కాపురం టౌన్/త్రిపురాంతకం: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికై సత్తా చాటారు. జిల్లాలో మార్కాపురం, త్రిపురాంతకం మండలాల్లో ఖాళీ అయిన ఉపాధ్యక్ష స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. మార్కాపురం మండలం వైస్ ఎంపీపీ-2గా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు కుందురు మల్లారెడ్డి, త్రిపురాంతకం వైస్ ఎంపీపీగా పాటిబండ్ల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, డీఎల్‌పీవో కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. మండలంలో మొత్తం 13 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక కోఆప్షన్ సభ్యుడు ఉన్నారు. వీరిలో 11 మంది సభ్యులు వైస్ ఎంపీపీగా కుందురు మల్లారెడ్డిని బలపరిచారు. మల్లారెడ్డికి ప్రిసైడింగ్ ఆఫీసర్ ధ్రువీకరణ పత్రం అందించి, ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా వైస్ ఎంపీపీ స్థానానికి బరిలో నిలిచిన కుందురు మల్లారెడ్డికి మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు తన నివాసంలో సోమవారం బి-ఫారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ బి.లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు పి.అరుణ చెంచిరెడ్డి, లక్ష్మమ్మ, పేతురు, సంధ్యారాణి, లక్ష్మీదేవి, వీరమ్మ, వెంకటసుబ్బమ్మ, వీరనారాయణమ్మ, ఎల్లమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లారెడ్డికి అభినందనలు

మార్కాపురం మండల వైస్ ఎంపీపీగా ఎన్నికైన మల్లారెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి అభినందించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పార్టీ ఏపీ మున్సిపల్ విభాగ కమిటీ సెక్రటరీ వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, పలువురు నాయకులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పాటిబండ్ల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. త్రిపురాంతకం ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ మేడపి ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ పేరును ప్రతిపాదించగా ముడివేముల ఎంపీటీసీ సాయపునేని సుబ్బారావు, మిగిలిన సభ్యులు బలపరిచారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఎంపీటీసీ సభ్యులను సమన్వయపరిచి ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా కృషి చేశారు. ఈ మేరకు పాటిబండ్ల కృష్ణతో ఎన్నికల అధికారి, మండల ప్రత్యేకాధికారి అయిన వండర్‌మేన్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపీడీఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మల్లారెడ్డికి బి-ఫారం అందజేస్తున్న అన్నా రాంబాబు

కటకటాల్లోకి కిలేడీ

- ● చోరీ కేసు ఛేదించిన కొండపి పోలీసులు
- ● నిందితురాలి నుంచి 165 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండి, పాస్‌పోర్ట్ స్వాధీనం
- ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కొండపి: ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో ఏమరపాటుగా ఉన్న మహిళ నుంచి బంగారు ఆభరాల బ్యాగ్ చోరీ చేసిన మహిళను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఈ నెల 12న కొండపి బస్టాండ్‌లో జరిగిన చోరీ కేసులో సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన జి.కుమారి ఈ నెల 12న కందుకూరు మండలం విక్కిరాలపేటలో బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో కొండపి బస్టాండ్‌లో కందుకూరు బస్సు కోసం కొంత సమయం వేచి ఉన్నారు. బస్సు ఎక్కే క్రమంలో కర్రల సంచిలో ఉన్న బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయగా కాసేపటికే గుర్తించారు. బ్యాగ్‌లో 130 గ్రాముల బంగారు ఆభరణాలు, 120 గ్రాముల వెండి వస్తువులు, పాస్‌పోర్ట్ ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. దీంతో సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ రెండు బృందాలుగా విడిపోయి కేసు దర్యాప్తు చేశారు. చీరాలకు చెందిన చవట అంజలిని నిందితురాలిగా గుర్తించారు. కందుకూరులో బంగారు ఆభరణాలు విక్రయించేందుకు వెళ్తున్న అంజలిని మద్దులూరు-అనకర్లపూడి గ్రామాల మధ్య పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి మొత్తం 165 గ్రాముల బంగారు ఆభరణాలు, 120 గ్రాముల వెండి, పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. చోరీ కేసును వారం వ్యవధిలో ఛేదించిన కొండపి సీఐ, ఎస్సై బృందాలను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించి రివార్డు ప్రకటించినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్, కానిస్టేబుళ్లు రవి, శంకర్, సుధాకర్, సురేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు ముగ్గురు అరెస్టు

- ● నిందితుల నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం
- ● కేసు వివరాలు వెల్లడించిన కంభం సీఐ మల్లికార్జున



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

కంభం: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కంభం సీఐ మల్లిఖార్జున తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీఐ విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. వైజాగ్‌కు చెందిన ఓ సాధువు బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామంలోని ముక్తేశ్వరం గుడి వద్ద ఉన్న మావిళ్ల శ్రీనివాసులు అనే సాధువుతో పరిచయం ఏర్పచుకున్నాడు. ఈ క్రమంలో అతనికి గంజాయి అమ్మితే మంచి డబ్బులు వస్తాయని ఆశ చూపాడు. దీంతో శ్రీనివాసులు బేస్తవారిపేటకు చెందిన వీరిశెట్టి వెంకటేష్, కంభానికి చెందిన గంటా నవీన్‌కు సమాచారం ఇచ్చాడు. ముగ్గురూ కలిసి వైజాగ్ నుంచి వచ్చిన సాధువు వద్ద కేజీ రూ.8 వేల చొప్పున 2.150 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. గంజాయిని గుడి వద్దనే ప్యాకెట్లుగా చేస్తే గ్రామస్తులకు తెలిసిపోతుందని భావించి కంభం చేరుకున్నారు. ఓ కిరాణా షాపులో చిన్న సైజు ప్లాస్టిక్ కవర్లు కొనుగోలు చేసి రావిపాడు రోడ్డులోని పంట పొలాల వద్దకు బయలుదేరారు. అదే మార్గంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయితో పట్టుబడ్డారు. తహసీల్దార్ వి.కిరణ్ సమక్షంలో గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురినీ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

కుదరని బేరం..!

- ● యర్రగొండపాలేనికి పంచాయతీ కార్యదర్శి నియామకం
- ● కూటమి నేత కన్నెర్ర చేయడంతో మరుసటి రోజే తొలగింపు

యర్రగొండపాలెం: తాత్కాలికంగా నియమించిన పంచాయతీ కార్యదర్శిని కూటమి నాయకుడి అనుమతి లేదని ఆ మరుసటిరోజే తొలగించారు. తాను ఇచ్చిన ఆర్డర్ కాపీని ఎంపీడీవోనే చించి ముక్కలు చేసి పక్కన పడేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురిజేపల్లి పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసులును ఖాళీగా ఉన్న యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమిస్తూ స్థానిక ఎంపీడీఓ బి.శ్రీనివాసులు ఈ నెల 16వ తేదీన నియామక పత్రం అందజేశారు. ఈ విషయం కొన్ని దినపత్రికలు, సోషల్ మీడియా గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. దీంతో నియోజకవర్గ కూటమి నాయకుడు తనను కలవకుండా, తన అనుమతిలేకుండా కార్యదర్శిని ఏ విధంగా నియమించారని ఎంపీడీఓపై కన్నెర్ర చేయడం.. ఆ మరుసటి రోజే అంటే 17వ తేదీన ఎంపీడీఓ ఆగమేఘాలపై పంచాయతీ కార్యదర్శిని పిలిపించి తాను ఇచ్చిన ఆర్డర్ కాపీని వెనక్కి తీసుకుని ముక్కలు ముక్కలుగా చించి తన కోపాన్ని చల్లార్చుకున్నట్లు కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. అసలు విషయం ఏమిటంటే.. యర్రగొండపాలెం పంచాయతీకి దాదాపు రూ.40 లక్షలు 15వ ఆర్థిక సంవత్సరం నిధులు మంజూరు కానున్నాయి. ఈ నిధులను టీడీపీకి చెందిన కొంత మంది నాయకులు పంచుకోవాలని పథకం రచించారు. ముందుగానే ఎంపీడీఓ తన వాటా మాట్లాడుకుని గురిజేపల్లి పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారని జోరుగా చర్చ నడుస్తోంది.

అయినసూ మారని తీరు!

యర్రగొండపాలెం పంచాయతీ కార్యదర్శితోపాటు ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఈదుల రాజశేఖరరెడ్డి ఇటీవల సస్పెండ్ అయ్యారు. ఈయన కూటమి నాయకుడితో అంటకాగి అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. స్థానిక ఎమ్మెల్యేను కాదని కూటమి నాయకుడు చెప్పిందే వేదంగా వ్యవహరించారు. ఈ ఏడాది జనవరి నెలలో స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం ఎదురుగా హైవే రోడ్డుకు అనుకుని ఉన్న సర్వే నంబర్లు 58, 58/1లో ఉన్న ఖరీదైన స్థలాలను మండలంలోని సర్వాయపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు దొడ్డపనేని శ్రీనివాసరావు అక్రమంగా గిఫ్ట్ డీడ్ చేయించుకొని తన భార్య యోగమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. కూటమి నాయకుడి ప్రోద్బలంతో ఈ రిజిస్ట్రేషన్ సజావుగా సాగేందుకు పూర్తి సహకారం అందించిన సూత్రదారుల్లో రాజశేఖరరెడ్డి ఒకరు. ఈ కేసును మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ విచారించి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ముందుగా తహసీల్దార్‌తోపాటు వీఆర్వో, సర్వేయర్‌పై కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీ ఖాళీలను భర్తీ చేసేందుకు టీడీపీ నాయకులు బేరం పెట్టినట్లు తెలిసింది. కూటమి నేతల అడుగులకు మడుగులొత్తినందుకు ఉద్యోగాలు ఊడినా కొందరు అధికారుల తీరు ఇంకా మారలేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.